# తలుపు

"నీకేం బాబాయ్! కొడుకు అమెరికాలో సెటిలైనాడు. కూతురూ అల్లుడూ కెనడాలో ఉన్నారు. ఇంతకన్నా అదృష్టం ఏవుంటుంది చెప్పు... ఏ తండ్రయినా ఇంకేం కోరుకుంటాడు ?"

"పిడికెడంత ఆదరణ... గుప్పెడంత ఆప్యాయత" బాబాయి నావైపు దిగులు కళ్ళతో చూశాడు." మావాడికి అమెరికాలో ఉద్యోగం వచ్చిన కొత్తలో నేనూ అలానే అనుకున్నాన్రా రామం. తర్వాత్తర్వాత అనుభవపూర్వకంగా తెల్సుకున్నాను – నేను అమెరికాకు పంపింది ఉత్త కొడుకుని కాదు.. నేను పెంచి, పోషించి ఇపుడు ఆశిస్తున్న ఆత్మీయానురాగాల్ని కూడా అని"

"అలా అంటావేమిటి బాబాయ్... నీ యింట్లో డాలర్ల పంట పండుతుంటేనూ"

"ఈ వయసులో మాకెందుకు బాబూ డాలర్లు? వాడు డబ్బులు పంపకున్నా మేం తినే గుప్పెడు మెతుకులకు కొదవ లేదు. మాకు కరువైంది పిల్లల ఆదరణ... మేం కోరుకునేది ప్రేమ నిండిన నాలుగు మాటలు... మాకో ఆసరా ఉందన్న చిన్న భరోసా"

వృద్ధాప్యంతోపాటు కన్న పిల్లల్లోని ప్రేమరాహిత్యం అతన్ని మరింత క్రుంగదీస్తున్నట్లనిపించి అనునయించే ప్రయత్నంలో "అందులో లోటుండదు బాబాయ్... ఎటొచ్చీ వ్యక్తీకరించకపోవచ్చు. దగ్గరా దాపా... చాలా దూరంలో ఉన్నారాయె. దానికి తోడు పని వత్తిళ్ళు... సంసార బాధ్యతలు... వాటిలో తలమునకలౌతూ ఎప్పుడైనా విస్మరించవచ్చేమో కానీ మీరంటే మీ పిల్లలకు వల్లమాలిన ప్రేమ" అన్నాను.

'నిజమా? నాకే తెలీదే' అన్నట్లు నా వైపు ఆశ్చర్యంగా చూసి, 'అదే నిజమైతే ఎంత బావుండు' అనే అర్థం వచ్చేలా నిట్టూర్పు విడిచాడు.

"ఈ రోజు విజయ దశమి. మూడు రోజుల్నించీ మీ పిన్ని కళ్ళలో వత్తులు వేసుకుని ఫోన్ ఎప్పుడు మోగుతుందా అని ఎదురుచూస్తోంది... కొడుకూ కూతురు ఫోన్ చేసి శుభాకాంక్షలు చెప్తారని... పిచ్చిది. ఉదయంనుంచీ పచ్చి మంచినీళ్ళు ముట్టుకోలా. నేనూ అంతే. ఇలా కంప్యూటర్‌కి కళ్ళనతికించి ఈమెయిల్ తెరిచి కూచున్నా. నా పిల్లల హృదయాలు పదాలుగా మారి జలజలా రాలిపడ్తాయన్న ఆశ... శుభాకాంక్షలు చెప్పటం అంత అవసరమా అంటావేమో. చాలా అవసరం బాబూ... మేం ఇంకా బతికే ఉన్నామని మా పిల్లలకు గుర్తుందనడానికి అదో నిదర్శనం."

మాట మారుద్దామని "ఉదయం నుంచీ ముసురు పట్టుకుంది బాబాయ్. వర్షం తగ్గేలాలేదు" అన్నాను.

"మీ పిన్ని కూడా ఉదయంనుంచీ కురుస్తోనే ఉంది రామం...కన్నీళ్ళని. నా కళ్ళల్లో తడి కన్పించదు. ఏడ్చిఏడ్చి ఎండిపోయి చాలా కాలమైంది. ఇపుడు గుండె రోదిస్తోంది బాబూ... పిల్లలకు విన్పించనంత నిశ్శబ్దంగా..."

అప్పటివరకూ తలవొంచుకుని విషాదదేవతలా కూచుని ఉన్న పిన్ని తల యెత్తి నా వైపు చూసింది."పండగపూట నువ్వయినా గుర్తుపెట్టుకుని వచ్చావు. చాలా సంతోషం బాబూ" అంటున్నప్పుడు ఆమె కళ్ళు మరోసారి నీటి పుష్పాలైనాయి.

"పోయినేడాది ఏదో పనుండి వచ్చాడు. వాడితోపాటు కూతుర్నీ పిల్చుకొచ్చాడు. నువ్వు చూశావుగా ... నాలుగేళ్ళ పిల్ల... ఎంత ముద్దుగా... కుందనపు బొమ్మలా ఉంటుందో... పట్టుమని పదిరోజులైనా ఉంచలేదు. ప్రాణం గిలగిల్లాడిందనుకో. ఈ వయసులో కొడుకులూ కోడళ్ళు... మనవళ్ళూ మనవరాళ్ళతో కలిసి సరదాగా కాలక్షేపం చేయాల్సిందిపోయి ఇలా బతకటం ఎంత దుర్భరంగా ఉందో... ఇదీ ఓ బతుకేనా అన్పిస్తోంది. ఎంత తొందరగా చావొస్తుందా అని ఎదురుచూస్తున్నా బాబూ" అంటూ పెద్దగా ఏడ్చేసింది.

"ఛ.. పండగ పూట అవేం మాటలు పిన్నీ...నువ్వే ఇలా అయిపోతే బాబాయిని

ఎవరు చూసుకుంటారు"అన్నాను.

"అది ఏడ్చి గుండె బరువుని కొద్దిగానైనా దింపుకుంటోంది. నాకా అదృష్టంకూడా లేదు" అన్నాడు బాబాయి."రామం! నామాట జాగ్రత్తగా విను. నీకు ఒక్కతే కూతురు. ప్రలోభపడి విదేశీ సంబంధాలు చేయకు. అసలీ సాఫ్ట్‌వేర్ కుర్రాళ్ళని వదిలేయి. వృద్ధాశ్రమాలు పుట్టగొడుగుల్లా పుట్టుకురావడానికి కారణం ఈ సాఫ్ట్‌వేర్ బూమే. మా అమ్మాయి విషయంలో ఇలానేగా మోసపోయాం. కుర్రాడు విప్రోలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు... హైద్రాబాదే కాబట్టి పిల్ల కళ్ళెదురుగా ఉంటుందని ఆశపడ్డాం. పెళ్ళయిన ఏడాదికే కెనడాలో మంచి అవకాశం వచ్చిందని వెళ్ళిపోయాడు. చిన్నఉద్యోగస్థుడైనా పర్లేదు. మంచివాడై ఉంటే చాలు. మనకు దగ్గరగా... హైద్రాబాద్ కాకున్నా పర్లేదు. మన రాష్ట్రంలో ఉంటేచాలు. వాళ్ళు తీరికలేదని రాకున్నా, మనమైనా వెళ్ళి కళ్ళారా చూసుకోవచ్చు. మనసారా మాట్లాడుకోవచ్చు. దూరాలు మనుషుల మధ్య దూరాల్ని పెంచేస్తాయి రామం"

వర్షం కొద్దిగా తెరిపిచ్చింది. వాళ్ళిద్దరి దగ్గర శెలవు తీసుకుని బైటపడ్డానన్న మాటేగానీ ఆ యింట్లోని విషాదమంతా నాలో గూడుకట్టుకున్నట్లు... నా పరిస్థితీ ఇంతేనా... ఒక్కతే కూతురు... అల్లారు ముద్దుగా పెంచిన కూతురు... స్వప్న. కంప్యూటర్ ఇంజనీరింగ్ చదువుతోంది. ఆ కోర్సులో చేర్చి పొరపాటు చేశానా... కంప్యూటర్ కోర్సు చదివిస్తే పెద్దపెద్ద ఉద్యోగాలు, వేలకువేల జీతాలు వస్తాయని ఆశించాను తప్ప పిల్ల మాకు దూరమౌతుందేమోనన్న ఆలోచనే రాలేదు. అమ్మో... అది మాప్రాణం. దూరమైతే మేం తట్టుకోలేం.

బాబాయి చెప్పింది నిజమే. దగ్గరగా ఉంటేనే అనుబంధాలు. అసలే వేగవంతమైన జీవితాలు...ఉరుకులూ పరుగులూ...లక్ష్యాల్ని చేరుకోవటంలో ఎదురయ్యే పోటీ... రకరకాల వత్తిళ్ళు... వీటన్నిటి మధ్య అనుబంధాల్ని, ఆప్యాయతల్ని కాపాడుకోవాలంటే ఓ యజ్ఞమే. శ్రమపడి, పట్టుదలతో సాధిస్తేనేకాని బలహీనమైపోతున్న ప్రేమలు జీవం పోసుకోలేవు.

యింటికి చేరుకునేప్పటికి తొమ్మిదికావస్తోంది. గబగబా మొహం కాళ్ళూ చేతులు కడుక్కుని సరిగ్గా తొమ్మిదికల్లా డైనింగ్ టేబిల్ దగ్గర కూచున్నాను. ఈ మధ్యకాలంలో స్వప్న కళ్ళకు కన్పించడమే గగనమైపోయింది. మాది రెండు బెడ్రూంల ఫ్లాట్. స్వప్నకోసం ఓ గది... మాకో గది. ఉదయం తొమ్మిదయినా తలుపు తీయదు. కాలేజికి వెళ్ళేముందు కన్పించి "హాయ్ నాన్నగారూ" అంటుంది. అంతే. మరలా రాత్రికి నేను హాల్లో ఉన్న సమయంలో భోజనానికి తన రూందాటి బైటికొస్తే కన్పిస్తుంది. ఎక్కువమార్లు తను పది దాటాకే భోంచేస్తుంది. అప్పటికి నేను నా బెడ్రూంలోకెళ్ళిపోతాను.

ఒకే యింట్లో ఉన్నా ఒక్కోసారి రెండుమూడు రోజుల వరకూ కన్పించదు.

"తన గదిలోకెళ్ళి తలుపెందుకు వేసుకుంటుందీ? మనం పరాయివాళ్ళం కాదుగా. తలుపు తెరిచేపెడితే కనీసం కళ్ళకైనా కన్పిస్తో ఉంటుందిగా" అని అడిగా రాణిని.

ఆమె కళ్ళలో విషాదం ఉప్పెనగా మారింది."ఆడపిల్ల...వయసులో ఉంది. తనకూ ప్రైవసీ అవసరంకదా" అంది. ఆమాట తన గాయపడ్తోన్న మనసుకు తను నచ్చచెప్పుకుంటున్నట్లనిపించింది.

రోజూనా...యింట్లో ఉన్నన్ని గంటలూనా... మా దగ్గర కూడానా...

నాకెందుకో ఆ సమాధానం సరికాదనిపించింది. ఆ తలుపు నాకూ నాకూతురికి మధ్య లంఖిణిలా అడ్డు పడ్తోందన్న భావన... ఆ తలుపే లేకుండా ఉంటే ఎంత బావుంటుంది! స్వప్న మాకు కన్పిస్తో ఉంటుంది. మా కళ్ళముందు కదలాడుతో ఉంటుంది. ఐనా గడియెందుకు పెట్టుకుంటుంది? మేం ఎవ్వరం రాకూడదనా...

ఉదయం సరే... ఎవరి హడావిడిలో వాళ్ళుంటారు. కనీసం రాత్రి భోజనాలయినా అందరూ కలిసి, కబుర్లు చెప్పుకుంటూ చేయొచ్చుగా. ఎవరిపాటికి వాళ్ళు... వాళ్ళకిష్టమొచ్చిన సమయంలో... ఏమిటిది? ఉన్నదే

ముగ్గురం... మూడు వేర్వేరు ఖండాల్లో ఉన్నట్లు... మూడు ద్వీపాలుగా విడిపోయి... నాకు భయమనిపించింది. అందుకే పది రోజుల క్రితం ఒక ఆర్డర్ జారీ చేశాను. ఆరు నూరయినా ఆకాశం తల్లక్రిందులైనా సరే రాత్రి తొమ్మిదింటికల్లా యింట్లోని ముగ్గురు సభ్యులు డైనింగ్ టేబిల్ దగ్గర కలవాలి. కలిసి భోంచేయాలి. ఆ కొద్దిసేపైనా సరదాగా కబుర్లు చెప్పుకోవాలి. కష్టసుఖాల్ని కలబోసుకోవాలి.

"స్వప్నని పిలువ్. నువ్వూ కూచో. భోజనాలు చేద్దాం" అన్నాను.

"అది చదువుకుంటోందండీ. ఆకలిగా లేదట. తర్వాత తింటానంది" అంది రాణి నాకంచంలో అన్నం వడ్డిస్తూ.

"అదేమిటీ. డిన్నర్ ముగ్గురం కలిసి చేయాలనికదా అనుకున్నాం . అలా నిర్ణయించుకుని పట్టుమని పదిరోజులైనా కాలేదు"

"నేనూ అదే చెప్పానండి. దానికి అన్నం తినాలన్న మూడ్ లేదట"

"అన్నం తినడానికి మూడ్ ఏమిటి? తొమ్మిదయింది. ఇంకెప్పుడు తింటుందట?" లేచి స్వప్న రూం దగ్గరకెళ్ళి తలుపు తట్టాను.

రెణ్ణిముషాల విరామం తర్వాత స్వప్న బోల్ట్ తీసి, తలుపు తెరిచి "ఏంటి నాన్నగారూ" అంది మొహంలో కదలాడుతున్న విసుగు ఛాయల్ని దాచుకుంటో...

"తలుపుకి బోల్టు కూడా ఎందుకమ్మా? నిన్నడక్కుండా ఎవరం లోపలికి రాము కదా" అన్నాను.

ఆమె సమాధానం కోసం కొద్దిసేపు ఎదురు చూసి, "భోజనానికి రాతల్లీ" అన్నాను.

"రేపు ఎసైన్‌మెంట్ ఉంది నాన్న గారూ. చదువుకోవాలి"

"అన్నం తిన్నాక చదువుకోవచ్చుకదా"

"ఇందులో కూడా బలవంతమా... నా ఇష్టాఇష్టాల్తో సంబంధం లేదా...ఆకలిగా

లేదని అమ్మకు చెప్పాగా" అంటున్నప్పుడు స్వప్న కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

గాయపడి... వెనక్కి వచ్చి డైనింగ్ టేబిల్ దగ్గర కూచున్నాను. అందరం కలిసి భోంచేయాలన్న కోరిక తప్పు బలవంతం చేశానా... తన ఇష్టాఇష్టాల్ని ఎప్పుడు కాదన్నాం? స్కూటీ కావాలని అడిగితే... యాక్సిడెంట్లు జరుగుతాయేమోనన్న భయంవల్ల నాకిష్టంలేకున్నా... కొన్నాను. డబ్బులు లేకున్నా అప్పుచేసి కొన్నాను. పండగపూట... ముగ్గురం కలిసి... సరదాగా...

"దాన్నెందుకు బలవంతపెడ్తారూ...అది సరిగ్గా తినదండీ. ఏం చదువులో ఏమిటో... పిల్లలకు తిండిమీద ధ్యాస ఉండటంలేదు. ఇంజనీరింగ్‌లో చేరినప్పటినుండీ ఎలా చిక్కిపోతుందో చూశారా? మీరు తినేయండి. కొద్దిసేపాగి నేనే దానికేమైనా తిన్పిస్తాను" అంది రాణి. ఆమె కళ్ళు వర్షించడానికి తయారుగా ఉన్న మేఘాల్లా ఉన్నాయి.

"కనీసం నువ్వయినా నాతోపాటు కూచోవచ్చుగా" ఆమెలో విస్తరిస్తున్న దిగులు చూసి, నాలోని దిగులు ఆమెకు కన్పించకుండా జాగ్రత్త పడుతూ అడిగాను.

"అది తిన్నాక తింటాలెండి. మీరు తినేయండి" అంది.

నాలుగు కుర్చీల డైనింగ్ టేబుల్.... 'మనం ముగ్గురమేగా. నాలుగో కుర్చీ ఎవరికి' అని ప్రశ్నించిన స్వప్నకు 'మనింటికి రాబోయే అల్లుడికి' అని అల్లరిగా సమాధానం చెప్తే అది సిగ్గు పడ్డట్టు గుర్తు.

ఇపుడు మూడు కుర్చీలు ఖాళీ...నన్ను వెక్కిరిస్తూ...

నా చిన్నతనంలో భోజనాలప్పుడు అందరం పీటలు వాల్చుకుని వరసగా కూచునేవాళ్ళం. నేనూ, నాన్న, నానమ్మ, అక్క, ఇద్దరు తమ్ముళ్ళు... అమ్మ ఎదురుగా కూచుని కొసరి కొసరి వడ్డించేది. ఎన్నెన్ని కబుర్లో... వూరి రాజకీయాలన్నీ అప్పుడే చర్చకు వచ్చేవి.

నాకు అన్నం సయించలేదు. సగంలోనే వదిలేసి నా గదికెళ్ళిపోయాను. రాత్రంతా నిద్ర పట్టలేదు. పీడ కలలు... నాకూతుర్ని ఎవరో రాక్షసుడు

ఎత్తుకెళ్ళిపోతున్నాడు. వాడి ఒంటినిండా డాలర్లతో చేసిన కొమ్ములు... కాపాడుకునే ప్రయత్నంలో ఓడిపోతూ... పెద్దగా ఏడుస్తూ నేను... ఓ మాంత్రికుడు వికృతంగా నవ్వుతున్నాడు. వాడి మెడచుట్టూ కంప్యూటర్లతో చేసిన హారాలు వేలాడుతున్నాయి. మంత్రదండం మూడు సార్లు తిప్పాడు. నేనూ రాణీ స్వప్న మూడు వలయాలుగా విడిపోయి... ఒకర్నుంచి ఒకరం... దూరంగా ... వెళ్ళిపోతున్నాం. మా చుట్టూ లోహపు గోడలు లేస్తున్నాయి... ఎత్తుగా... ఆకాశంలోకి చొచ్చుకుపోతూ... నేను పెద్దగా అరుస్తూ లేచి కూచున్నా... వళ్ళంతా చెమటతో తడిచిపోయింది.

* * *

ఉదయం లేచినప్పటినుండీ యాంత్రికంగా పనులు చేసుకుంటున్నానన్న మాటేగాని దృష్టంతా స్వప్న గది తలుపువైపే ఉంది. ఆఫీస్‌కెళ్ళేలోపల ఒక్కసారైనా చూడకపోతే మనసంతా అలజడిగా ఉంటుంది. టిఫిన్ తినడానికి బైటికొస్తుందని ఆశ...

“ఉదయం నేనే టిఫిన్ తీసుకెళ్ళి రూంలో ఇచ్చొచ్చాను. హోటళ్ళలో ఉంటుంది చూశారా... రూం సర్వీస్” అంది రాణి నవ్వడానికి వృధాగా ప్రయాసపడ్తూ.

నిన్ననేగా చెప్పా బోల్టు వేసుకోవద్దని... తలుపు తీసి ఒక్కసారి పల్కరిద్దామని తలుపు నెట్టి చూశా. బోల్టు వేసి ఉంది. తలుపుని బద్దలు కొట్టాలన్నంత కోపం. తమాయించుకున్నా. నేను తయారయి సోఫాలో కూచున్నా. ఇంకెంత... మరో పది పదిహేను నిముషాల్లో స్వప్న బైటికొస్తుంది. నన్ను చూసి ‘హాయ్’ అంటుంది. ఆ ఒక్క మాట... ఆ ఒక్క చూపు... రోజంతా పనిచేసే శక్తినిస్తుంది. బతుకుమీద తీపిని పెంచుతుంది.

తలుపు తెర్చుకుంటున్న చప్పుడుకే గుండె ఉద్వేగంతో నిండిపోయింది. స్వప్న వేగంగా కిచెన్‌లోకెళ్ళి వాళ్ళమ్మ కట్టిచ్చిన టిఫిన్ బాక్స్ తీసుకుని, అంతే

వేగంగా బైటికెళ్తూ "నాన్నగారూ... బై" అంది. నా వైపు సరిగ్గా చూడనుకూడాలేదు. క్షణం... మెరుపు మెరిసినట్లు. మరలా రాత్రికే... అదీ ఖచ్చితంగా కన్పిస్తుందని చెప్పలేం. నా అదృష్టం... అంతే.

"ఈ రోజు మంచి రోజు. బండిమీదెళ్ళు" అంటోంది రాణి.

నేనూ బైటికెళ్ళి "జాగ్రత్త తల్లీ. కాలేజీకి చేరుకున్నాక రింగివ్వు. లేకపోతే టెన్షన్ పడ్తాను" అన్నాను.

"సరే" అంటూనే సర్రున దూసుకెళ్ళిపోయింది.

ఆఫీస్‌లో పని చేస్తున్నానన్నమాటేగాని మనసంతా స్వప్న దగ్గరే ఉంది. నా సెల్లోకి పదిసార్లు చూసుకున్నా... మిస్సెడ్ కాల్స్‌కానీ మెసేజెస్‌కానీ ఏమైనా మిస్సయినానా అని. ఆలస్యమయ్యేకొద్దీ నాలో ఆందోళన... క్షేమంగా వెళ్ళి ఉంటుందా... కాలేజీకి చేరగానే ఫోన్ చేయమన్నాగా... ఎందుకు చేయలేదో?

ఇంటికి ఫోన్ చేసి వాకబు చేశాను. "యింటిక్కూడా ఫోన్ చేయలేదండి. నాకూ కంగారుగానే ఉంది" అంది రాణి.

స్వప్న సెల్‌కి రెండు మూడు సార్లు ఫోన్ చేశాను. స్విచెడ్ ఆఫ్ అని వస్తోంది.

భయమనిపించింది. మనసు పరిపరివిధాలా పోతోంది. చెడుగా ఆలోచించకూడదని సమాధానపర్చుకున్నా.

సాయంత్రం ఐదు దాటినప్పటినుండీ ఏ పదిసార్లో ఇంటికి ఫోన్‌చేసి ఉంటా "వచ్చిందా" అని అడగటానికి. ఆరున్నరకు రాణి ఫోన్ చేసింది. స్వప్న ఇంటికి చేరుకుందట. హమ్మయ్య అని వూపిరి పీల్చుకున్నా. కొన్ని గంటల్లో ఎంత హింస పడ్డానో... ఎంత క్షోభని అనుభవించానో...

ఇంటికి చేరుకునేప్పటికి ఎనిమిది దాటింది. "స్వప్న ఏదీ" అని అడిగా.

"భోంచేసి ఇప్పుడే తన గదిలోకెళ్ళిందండి"

"ఫోన్ ఎందుకు చేయలేదట"

"మరిచిపోయిందట. మీకు సారీ చెప్పమంది. "అంటున్నప్పుడు రాణి కళ్ళలో అనంతమైన దిగులు.

నేను వచ్చినట్టు తెలీకుండా ఉంటుందా... ఒక్క తలుపేగా అడ్డం... శబ్దాలు విన్పించవా.... మా మాటలు విన్పడనంత దీక్షగా చదువుతుందా... తనే బైటికి వచ్చి సారీ చెప్పి ఉంటే ఎంత బావుండేది... ఇంత సమీపంగా ఉన్నా ఎక్కడో వేలమైళ్ళ దూరంలో ఉన్నట్టు... దూరాలే మనుషుల్ని దూరం చేస్తాయా... మా మధ్య ఒక్క తలుపేగా... పల్చటి తలుపు... చెక్కతో చేసింది. అంతే. ఇనుప తలుపేం కాదుగా... దూరం దగ్గరా అనేవాటితో సంబంధం లేకుండా అనుబంధాలన్నీ బీటలు వారుతున్నాయా... ఇది నా యింట్లోనే ఉందా ప్రతి తల్లిదండ్రుల పరిస్థితీ ఇంతేనా... పెంపక లోపమా... ప్రపంచీకరణ పుణ్యమా... స్వప్నకు మేమంటే ప్రేమలేదా... నిర్లక్ష్యమా... ఏం తక్కువ చేశామని... నేటి యువతనిండా ఈ ప్రేమరాహిత్యం బలంగా వేళ్ళూనుకుపోయిందా... బాబాయి యింట్లో అంగుళం అంగుళం పేరుకుపోయిన దిగులు నా యింట్లోనూ తిష్ట వేస్తుందా... నా కూతురికి నేను పరాయినయిపోతానా... రాత్రంతా పిచ్చిపిచ్చి ఆలోచనలు....

★ ★ ★

మరో రెండ్రోజులు పోతే దీపావళి.... నాకు చాలా ఇష్టమైన పండుగ.

నా చిన్నతనంలో దీపావళి పండక్కి పది రోజులముందు నుంచే హడావిడి మొదలయ్యేది. వెన్నముద్దలు తయారుచేయడంకోసం అవసరమైన గంధకంపొడి, సూరేకారం కొనుక్కుని, కాగితాల్ని గొట్టాలుగా చుట్టి అందులో మందుని కూరేవాళ్ళం.

పండగరోజైతే మాయింటిల్లిపాది మతాబాల్లా వెలిగిపోతూ... మొహాలనిండా గుత్తులు గుత్తులుగా వెల్తురు పూలు పూసినట్లు...

బాణా సంచా కాలుస్తుంటే మా నాయనమ్మకూడా పాలుపంచుకునేది.

"ఛీ...ఏం పొగలో పాడు" అని తిట్టుకుంటూనే కదిలేది కాదు. "టపాసులు కాల్చకండర్రా... ఆ శబ్దాలు భరించలేకున్నాను" అనో "ఒరే నాయనా.. చిచ్చుబుడ్డి పేలుతుందేమో... దూరంగా జరుగు"అనో అంటూ ఉండేది.

"వెన్న ముద్దలు అటునుంచి కాల్చాలి. ఇటువైపంతా ఇసుకే" అంటూ నాన్న పడే అవస్థల్ని చూసి అమ్మ నవ్వేది. "నాకూ రెండు కాకరపువ్వొత్తులివ్వండి. కాల్చి పడేస్తాను" అనేది. ఎంతటి సందడి... ఎంతటి సంబరం...

స్వప్నకు కూడా దీపావళి అంటే ఇష్టమే...నాకు మల్లే...

తొందరగా ఆఫీసునుండి ఇంటికెళ్ళాను. "స్వప్నని రెడీ కమ్మను. హాకాకెళ్ళి బాణాసంచా కొనాలి"

"దానికి రేపేదో సెమినార్ ఉందట. బిజీగా ఉంది"

"ఓ గంట బైటికెళ్ళొస్తే కొంపలేం మునిగిపోవులే"

"మీరే అడగండి" రాణి భావరహితంగా కన్పించడానికి ప్రయత్నిస్తూ అంది.

తలుపు నెట్టాను. బోల్టు వేసి ఉంది.

స్వప్న తలుపు తీసి ఏమిటన్నట్లు చూసింది.

"బాణా సంచా కొనాలి కదా. వస్తావా"

"నేను రాలేను. చదవాల్సింది చాలా ఉంది"

"పోన్లే... నేనే వెళ్ళి కొనుక్కొస్తాను. పండుగ రోజు ఇద్దరం కాలుద్దాం"

"కుదరదు నాన్నగారూ"

"ఏం"

"టైంలేదు"

బాణాసంచా కాల్చాలన్న ఆసక్తి ఒక్కసారిగా చప్పబడిపోయింది.

★★★

పండుగ రోజు ఉదయంనుంచీ చాలా ఉత్సాహంగా ఉన్నాను. రాణిని

ఏ పదిసార్లో అడిగి ఉంటాను. 'స్వప్న తలంటుకుని, కొత్తబట్టలు వేసుకుని, తయారైందా లేదా అని'...

"రాత్రి చాలా సేపటివరకు చదివినట్టుందండీ. ఇంకా పడుకుంటోంది" అంది రాణి.

నేను తయారయి స్వప్న కోసం ఎదురుచూస్తూ కూచున్నా. ఎపుడెపుడు తలుపు తెర్చుకుంటుందా అని ఎదురు చూస్తూ... నా కూతురు పట్టుబట్టలు ధరించి, కుందనపు బొమ్మలా కదిలి వచ్చి "దీపావళి శుభాకాంక్షలు నాన్నగారూ" అనే అద్భుతమైన ఘడియల కోసం...

స్వప్న కళ్ళు కలువ పువ్వుల్లా ఉంటాయి. నాకు దీపావళి పండగంటే చాలా ఇష్టమని తనకు తెలుసు. తను నాకు శుభాకాంక్షలు చెప్తున్నప్పుడు దాని కళ్ళు మతాబాల్లా వెలగటం చూడాలన్న బలమైన కోరిక... దాని మొహం వెల్తురు చెట్టులా మారిపోవటం... ఓ అందమైన అనుభవం... దివ్యమైన అనుభూతి...

స్వప్న తన గదిలో ముస్తాబవుతో ఉంటుంది. మా ఇద్దరికీ మధ్య తలుపు... బోల్టులు వేసిన తలుపు...

తొమ్మిదిన్నరకు సెల్లో మెసేజ్ వచ్చింది.

"హ్యాపీ దీవాలీ డ్యాడ్- స్వప్న"

స్వప్నకూ నాకూ అడ్డుగా ఉన్న తలుపు ఇండియాని, అమెరికాని వేరు చేస్తున్న మహా సముద్రంలా... అనంతంగా పెరిగిపోయి... ఉప్పెనలా పొంగిపోయి... నన్ను ముంచెత్తుతూ.... నాకు వూపిరాడ్డంలేదు. ప్రాణం పోతున్నట్లుంది. శరీరంలోని ప్రతి కణం బాధతో విలవిల్లాడుతోంది. ఇక నా హృదయం సంగతి వేరే చెప్పాలా...

(విపుల మాసపత్రిక, నవంబర్ 2008)

★ ★ ★